# కవిద్వయ సమ్మేళనం

(కథానిక)

విశేష ప్రచారంలో ఉన్న 'ఉత్సాహి' పత్రికలో రకరకాల విషయాలతో కూడివున్న రచనలు ప్రచురింపబడుతూంటాయి. మఖలో పుట్టి పుబ్బలో మసి అయిపోయే పత్రికలున్న యీ రోజున, విశేష ప్రచారం సంపాదించుకొన్నదంటే, అది కేవలం అందులో ప్రచురింపబడే రచనల విలువ మూలాన్నేనని మీరంగీకరించక తప్పదు.

ఈ పత్రికా సంపాదకులు అనామకులు ... అందులో రచయితలు అనామకులు... అనామకంగా మారు పేర్లతో పత్రిక నడపటంలో అర్థమేమిటో ఆ సంపాదకులకే తెలియాలి గాని మనకు ఎంత యోచించినా తెలియదు. సంపాదకులు అనామకంగా ఉండటానికి కారణం ఏమయినా ఉండవచ్చు (ఊహించి చూడండి కన్పిస్తాయి). అయితే అందులో ప్రచురింపబడే రచనలూ అనామక రూపాలతో నిండి యుండటంలో ఉండే విశేషం బోధపడటం చాలా కష్టం! 'పత్రికా సంపాదకుల పేరు 'మరామ'. కార్యవర్గం ... 'సత్యాన్వేషి, సంతోషి' 'వగైరాలు. ఇక రచయితలు...'రోహిణి, మృగశిర, భరణి, మిథునం, సన్యాసి, శేషు కమలం, కోమల, హనుమాన్, జయంతి' వగైరా. (ఈలాంటివి ఇంకా చాలా ఉన్నాయని మనవి)

'ఉత్సాహి' పత్రికా రచయితల్లో సత్యనారాయణమూర్తి ఒకడు. అతడు ప్రథమంలో ఒక రచన పూర్తి నామంతో 'ఉత్సాహి' కార్యాలయానికి పంపిస్తే రచనలో 'మెరిటు' ఉన్నప్పటికీ 'మారుపేరు'తో రచన తిరిగి పంపవలసిందని వారు సూచిస్తూ రచన త్రిప్పి పంపారు. సత్యనారాయణ యోచన చేసి 'సత్య' అనే నామంతో రచన పంపితే ఆ నెలలోనే ప్రచురించటమే కాకుండా ప్రతిఫలం కూడా అప్పటి కప్పుడే పది రూపాయలు పంపించారు. యువకుడై (వివాహం కాలేదని గ్రహించాలి) ఆధునిక భావాలు గల సత్యనారాయణ చదువుకుంటున్నప్పటికీ, చదువు సంధ్యలమీద కంటె రచనలలోనే మంచి ఆసక్తి చూపిస్తూ 'సంతోషి' పత్రికకు శాశ్వత వ్యాసకర్త అయ్యాడు. సత్యనారాయణ ఓ నెల మారు పేరుతో ఆడపిల్లల్ని విమర్శిస్తూ చక్కగా కథ వ్రాశాడు. అది ప్రచురించబడింది.

'సత్య' పేరుతో అనామకంగా ఉన్న సత్యనారాయణమీదకు చాలామంది (రచయితా, రచయిత్రులు) దండయాత్ర ప్రారంభించారు. 'సత్య'- ముఖ్యంగా స్త్రీయో, పురుషుడో తెలియకుండా ఉండటంవల్ల, కొంతమంది సోదరీ, అనీ, మరికొంతమంది సోదరా అనీ, మరికొంతమంది నపుంసక చక్రవర్తీ అనీ ఏమేమో ఉత్తరాలు అభినందిస్తూ, దూషిస్తూ పత్రికా కార్యాలయానికి 'సత్య' గారి కివ్వవలసిందంటూ, పంపవల్సిందంటూ పంపారు. 'మరామ' గారికి (సంపాదకులన్న సంగతి మరవకండి) ఇదంతా ఒకమూల సంతోషం, వేరొకమూల విచారం కలగచేసింది.

మరునటి నెలలో 'సత్య' అనే అనామకుడు వ్రాసిన రచనకు మరో రచన జవాబుగా వెలువడింది సంతోషి పత్రికలోనే 'కోమలం' అనే పేరుతో. 'సత్య' వ్రాసిన రచనకు 'కోమలం' తగిన జవాబు నిచ్చగా (కోమలంగారు వివాహం కాని స్త్రీ) ఈమారు కూడా 'సత్య'ను దుమ్మెత్తిపోస్తూ 'మరామ' గారి పేర 'కోమలం' కు (మామూలుమారు పేర్లతో) ఉత్తరాలు వ్రాశారు మరో పార్టీ వారు. అంటే సత్యగారి భావాలతో యేకీభవించినవా రన్న మాట.

'మరామ' గారికి యీ రెండు సంగతులూ మంచి గందరగోళం గల్గించాయి. ఏం చేయటానికీ తోచక 'ధూషణ భూషణాలనే' ప్రత్యేక శీర్షిక తమ సంతోషి పత్రికలో యేర్పరచి,

ఓగేటి శివరామకృష్ణ

ఉత్తరాలద్వారా వచ్చిన విషయాల్లో కొన్ని ఈ శీర్షికద్వారా ప్రచురణ జరపటం ప్రారంభించాను (అనామక నామముల్తోనే)

ఈలా రెండుమూడు సంచికలు వెళ్ళిరా 'సత్య' గార్నిగాని, 'కోమలం'గారినిగాని దూషించటాలు తగ్గలేదు. ఇది శాశ్వతశీర్షిక చేయాల్సి ఉంటుందేమోనని 'మరామ'గారికి భయం వేస్తోంది. ఇంత గందరగోళం అక్కడ జరుగుతున్నా ఇటు శ్రీయుతులు 'సత్య'గాని శ్రీమతి 'కోమలం' గాని మరి 'సంతోషి'కి రచనలు పంపలేదు. చివరకొచ్చి అరుపు గుద్దులాట పైవాళ్ళదే అయింది.

'మరామ' గారికి యేం చేయటానికి తోచకుండే సరికి హితుని విధంగా 'స్నేహశ్రీ' అనే అనామక రచయిత వ్రాసిన దూషణభూషణాలు చదవటంతోటే ఒక అభిప్రాయం యేర్పడ్డది. స్నేహశ్రీ వ్రాసిన విషయం యేమంటే "మాలో మేం యీవిధంగా తగువు లాడుకొనటం కంటె మీరా 'సత్య-కోమలం' గార్లను (రచయిత్రీ-రచయితలను) ఒకచోట కలిపి వారితో సంభాషించి సమస్య ముగింపునకు తీసుకొని రావటం చాలా శ్రేయస్కరం. మాబోటి వియటివాళ్ళు కల్పచేసుకొనటం అనవసరం. అమూల్యమైన మీ పత్రికలో దూషణ భూషణాలతో కాగితాలు పాడుచేయటం శుద్ధ దండగ—స్నేహశ్రీ"—అని. ●

స్నేహశ్రీ గారి సలహా 'మరామ' గారికి నచ్చింది. వెంటనే 'సత్య C/O సత్యనారాయణ గారికీ, కోమలం C/O శ్రీమతి కుసుమ కోమలం' గారికి రెండు ఉత్తరాలు, ప్రత్యేకంగా మాట్లాడుటానికి తమ కార్యాలయానికి రావలసిందనీ, రాకపోకల ఖర్చులు తామే భరించుకొంటామని బయలుదేరి రావలసిందనీ వ్రాశాడు మరామ.

ఇరువురూ తమ అంగీకారాలు తెలుపుతూ ఉత్తరాలు వ్రాశారు. శ్రీమతి కోమలంగారు 'సత్య' ఒక స్త్రీ అని ఆమెను తనతోబాటు యే అభిప్రాయానికి తీసుకొనిరావడం చాలా తేలికనీ మేటరు సిద్ధపరచుకొని బయలుదేరింది.

సత్య 'కోమలం' తనతోబాటు ఒక మగవాడై ఉండగలడనీ (రచనల్లో మొగతనంగాని, ఆడతనంగాని యెక్కడా, ఎవరూ ప్రదర్శించుకోలేదు) మగవాడ్ని మగవాడు బోల్తా కొట్టించటానికి శ్రమపడ నక్కరలేదనీ ఉద్దేశ్యపడి బయలుదేరాడు.

'మరామ' తన కోరిక ప్రకారం ఇద్దరూ వచ్చినందుకు విడివిడిగా (ఒకరిని ఒకరు మరి మొదట్లో చూసుకోలేదు) కృతజ్ఞత వెల్లడించి, విషయం చర్చించుకోనేందుకు, తమ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒకగది ఏర్పాటు చేశాడు. గదిలోనికి ప్రారంభంలో 'కోమలం' గారు వెళ్ళి కూర్చున్నారు. తర్వాత 'సత్య'గారు వెళ్ళారు. ఒకరిముఖాలు ఒకరు చూసుకొన్నారు ఆశ్చర్యపోతూ. ఎందువల్లనంటే సత్య 'కోమలం' మగవానిగాను - కోమలం 'సత్యను' తనలోటి స్త్రీగాను భావించుకున్నారు. మరి అలా యిప్పుడు తామనుకున్నట్టు కాకుండా అంతా కొత్తగా గోచరిస్తూంటే యిరువురూ కూడా ఆశ్చర్యపోతూ అలాగే నిలబడి పోయారు.

కాని కొద్ది నిముషాల తర్వాత, 'మరామ' తొందర తొందరగా వచ్చి 'క్షమించండి ఆలస్యం అయినందుకు. అనవసరంగా మిమ్మల్ని శ్రమపెట్టా. వీరు సత్యగారు' అని కోమలంగార్ని 'వీరు కోమలంగారు' అని సత్య గారికి పరిచయం చేసి 'మీరే యుద్దేశాలతో పిలంపబడ్డారో మీకు తెలిసే ఉంటుంది. తమ కర్తవ్యాలు మనస్సులో ఉంచుకొని సమిష్టిగా ఒక అభిప్రాయానికి వస్తారని ఆశిస్తున్నా. అవసరం అయితే పిలవండి వస్తాను' అంటూ వెళ్ళిపోయాడు 'మరామ'.

ఒకళ్ల నొకళ్లు చూచుకొంటూ గంట సేపు కాలక్షేపం చేశారు. సత్య, కోమలంగార్లు ఏం సంప్రదింపులు జరుపుకొన్నారో యేమో గాని గంట తర్వాత యేకకంఠంతో 'మరామ' గారిని పిలిచారు. ఆయన రావడంతోటే 'సమిష్టి భావం యేర్పడ్డది' అని యిరువురూ ఒకే మాటన్నారు.

సంతోషి తరువాతి సంచికలో 'కవిద్వయ సమ్మేళనం' అని కథ ప్రచురించబడింది. రచయితలుగా శ్రీయుతులు సత్య, శ్రీమతి కోమలం పేర్లు ఉదహరించబడ్డాయి.